

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



# – 21 –

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**"ఇవాళ** వాసుదేవ్, మేథమాటిక్స్ గురించి గెస్ట్ లెక్చర్ ఇస్తేనూ వెళ్ళాము. ఎంత బాగుందనుకున్నావు. గణితానికి, ఆధ్యాత్మికతకూ సంబంధం ఉందన్నాడు. గణితంలో అతను ఒక్కో విషయం చెప్తుంటే నేనే ఆశ్చర్యపోతాను."

ఈ మధ్య వల్లిగారి కబుర్లలో ఆ పేరు ఎక్కువగా వింటున్నాను.

"ఎవరండీ ఆయన?"

"క్లబ్ పార్క్ కట్టించిన పార్థ సారథి గారున్నారు కదా! ఆయన బావగారు. అమెరికాలో ఉంటారట. సెలవలకని వచ్చారు."

"ప్రకృతి లో సౌందర్యమే కాదు, సందేశం కూడా ఉందంటాడు. కవిత్వం కూడా అంతేనట. ఎంత నిగూఢమైతే అంత అందమని, అంత అర్థమని!"

నాకేదైనా అర్థమవుతుందా అన్న సంగతి నాకే అనుమానంగా ఉంది.

"సంతోషాన్నీ, దుఃఖాన్నీ విడదీయలేమట. కలిసే ఉంటాయట. ఒకటి పోగానే , ఇంకొకటి."

"ఎవరు మీకివన్నీ చెప్పేది?" అన్నాను విసుగ్గా

"ఎందుకే అంత చిరాకూ? నిన్న వాసు దేవ్ మాట్లాడుతూ చెప్పాడు మాకీ విషయాలు. తను పొయెట్రీ గురించి చెప్తుంటే, ఎంతో బాగుంది. ఎన్ని అర్థాలు. ఎన్ని లేయర్స్. ఒక దానికి ఇంకోదానికి పోలిక కూడా ఉండదు. నువ్వూ ఉంటే బాగుండనుకున్నాను."

"నా వల్లకాదు, నాకు కవిత్వంటే భయం."

"కాదే , నిన్నో సారి తీసుకెళ్ళాలి. నిన్న ఒక పాటను ఎనలైజ్ చేసి ఎంతబాగా చెప్పాడనుకున్నావూ!"

"పాట విని ఊరుకోవాలిగానీ, దాన్ని చీల్చి చెండాడాలా చెప్పండి. "

"గాడిదా, నీకేం తెలుసు, ఎంత బాగా పాడతాడనుకున్నావూ ? చెవిలో తేనె పోసినట్టే! నీకోసారి వాసుదేవ్ పాట వినిపించాలే."

"నాకేం వద్దండీ."

"పాట వినడానికి ఏమైందే ? మాయరోగం."

"మరీ, తేనె చెవిలో పోసుకోవడం ఏంటండీ? నాకిష్టం లేదు. తేనె, వేరే రకంగా వాడతాను నేను."

“ఇవాళో వింత జరిగింది తెలుసా. వాసుదేవ్ నన్ను చెస్ లో ఓడించాడు.”

“ఎవరూ ఆ చెవిలో తేనె పాటాయనేనా ? ఆయనకు చెస్ కూడా వచ్చా?”

“ఏమిటే ఆ వెటకారం?”

"మీరెవరి చేతిలోనైనా ఓడిపోయారంటే నమ్మను. మీరే కావాలని గెలిపించి ఉంటారు. నన్నెప్పుడైనా గెలిపించారా?”

“లిటరేచర్ గురించి, పొయెట్రీ గురించి ఎంత బాగా మాట్టాడతాడే! నిన్న తను మాట్లాడుతుంటే వింటూ ఉండిపోయాము.

“ఎందుకలా ఉండిపోవడం. మీరంతా కూడా ఏదైనా మాట్టాడకపోయారా? చుట్టూ అమ్మాయిలుంటే కవిత్వమూ, కోయిలా, వెన్నెలా అంటూ అలాగే కబుర్లు చెప్తార్లెండి. నమ్మకండి.”

“నోర్మూసుకో గాడిదా. నోటికెంత వస్తే అంతేనా? అక్కడ అమ్మాయిలెవరున్నారే? అందరం అమ్మమ్మలమే కదా!”

“ఎందుకొచ్చారంట ఆయనా , అమెరికా నుండీ? ఇంకా ఎన్నాళ్ళుంటారూ. ఇక వెళ్ళరా? ”

“అబ్బా. అవన్నీ ఎలా అడుగుతాము? పద్ధతి, పాడూ తెలియదేమే మీ డాక్టర్లకు .”

“భార్యా పిల్లలు ఉన్నారా?"

“పెళ్ళి చేసుకోలేదట.”

“పాటలు ఎనలైజ్ చేస్తూ , చేస్తూ , పెళ్ళి సంగతి మర్చి పోయుంటారు సార్!”

“మీ డాక్టర్లెంత మొరటుగా ఆలోచిస్తారే!”

“ఏదైనా అనాలనుకుంటే నన్నే అనండి. మా అందర్నీ కలిపేసి అంటే బాగోదు. ఉదాత్తులైన వాళ్ళెంతో మంది ఉన్నారు మా క్లాసు లో.”

“నీకు మా వాసుదేవ్ అంటే ఎందుకే పడదూ?”

“నాకెందుకో ఆయన ధోరణి అతిగా అనిపిస్తోందండీ.” గాల్లోకి చూస్తూ అన్నాను.

“మనిషిని చూడలేదుగా నువ్వు.”

“చూడాలా? మీరు చెప్తుంటే తెలియట్లేదూ? నాకలా ఓవర్ చేసే మనుషులిష్టం లేదండీ.”

“ఏడిశావులే! కీట్స్ , షెల్లీ గురించి ఎంత చక్కగా చెప్పాడనుకున్నావు? వాళ్ళెవరో తెలుసా నీకు?”

“ఎవరో నవల్లు రాసే మనుషులైయ్యుంటారు.”

“ఎవరి పేరెత్తినా నవల నవల అంటావు. నీకేమైనా పిచ్చా? వాళ్ళు రాసింది పొయెట్రీ.”

“ఏ రాయైతేనేం లెండి.”

“కనపడవుగానీ, భలే రెతమతం మనిషివే. ఒక పని చెయ్యి. రేపు సెలవు పెట్టు. నిన్ను పరిచయం చేస్తాను.”

“నేనెందుకండీ. మీరంతా గొప్పవాళ్ళు , తెలివిగలవాళ్ళూ.”

“కాదే, రోజూ చెప్తావుగానీ, ఒక్క సారి కూడా తీసుకురావు అన్నాడు వాసుదేవ్. ఒకసారి నిన్ను చూపిస్తా ఆయనకు.”

“రోజూ చెప్తారా? ఏం చెప్తారండీ నా గురించి?”

నాకు నిజంగా తెలుసుకోవాలనిపించింది.

"మీ డాక్టర్లకెప్పుడూ ఆరాలు కావాలి."

"ఆఖరు సారి చెప్తున్నాను! ఏదైనా అనాలంటే నన్నొక్కదాన్నే అనండి. మావాళ్ళనందర్నీ అంటే ఊరుకోను"

"ఏడిశావులే!"

నాలుగైదు రోజుల తర్వాత ఒక సారి నా రూం కి జయ వచ్చింది.

మామూలుగా అయితే తలుపు దగ్గరే నిలబడి , 'పాపని మ్యూజిక్ పోటీలకు తీసుకెళ్ళాలనో , ఒక కేస్ నాలుగింటికి పోస్ట్ చేశాను. కొంచం చూసుకోవా' అనో చెప్పేసి పరుగు తీసేది. లోపలికి వచ్చి కూర్చుందంటే ఏదో విషయం ఉంది.

కంప్యూటర్ లో ఏదో టైప్ చేస్తూనే, ఈ మధ్య డిపార్ట్ మెంట్ లో జరిగిన విషయాలపై మనసులోనే ఒక చూపు వేశాను.

అనుమానంగా ఏదీ కనబడలేదు.

టైపింగ్ ఆపకుండా, "ఊ..చెప్పు" అన్నాను.

''ఈ మధ్యన విఠల్ ని పార్క్ క్లబ్ కి పంపిస్తున్నాను. జాగింగ్ కు వెళ్తున్నాడు."

"నిజమా. మంచిదేగా"

"ఏం లేదు. అమ్మ విషయం, నీతో మాట్లాడదామనీ "

టైపింగ్ ఆపేశాను.

"వల్లిగారికి ఏమైంది?"

"తను బాగానే ఉంది. క్లబ్ లోనే. ఎవరెవరో తెలియని వాళ్ళతో చెస్ ఆడుతోందనీ, అసలా వాతావరణం అంతా ..అదేం బాగోలేదని విఠల్ ఫీలవుతున్నాడు."

"ఆమె స్నేహితులతో సంతోషంగా ఉంటే మనకేమైంది?"

"అది కాదు. అమ్మ ఈ వయసులో అలా అందరితోనూ చనువుగా ఉండడం ఏం బాగుంటుంది. పరువొకటి ఉంటుంది కదా."

ఎవరి సొంత బావిలో, వారికొక సొంత రాజ్యాంగం, ప్రోటోకాల్స్ ఉంటాయి. అవి పాటించకపోతే పరువు పోయినట్టు.

"విఠల్ కు చాలా ప్రిన్సిపుల్స్ ఉన్నాయి. ఇలాంటివసలు నచ్చవు."

'నచ్చకపోతే, నచ్చిన బావిలో దూకమను' మనసొక పరిష్కారం సూచించింది.

కొంత మంది స్త్రీలను చూశాను. బయట ఎంతో ధైర్యంగా ఉంటారు. ఇంట్లో భర్త ఎంత అన్యాయంగా ప్రవర్తిస్తున్నా సరే, ఒక్క మాట ఎదురు చెప్పరు. రౌడీయిజం చేసి, డిపార్ట్ మెంట్ ని అల్లకల్లోలం చెయ్యగల జయకు భర్తన్నా, భర్త మాటన్నా విపరీతమైన గురి.

"నాకూ అమ్మకూ మధ్య ఒక దూరం ఉంది. ఎప్పుడూ ఇలాంటివి మాట్లాడుకోలేదు. నువ్వే చెప్పాలి."

"ఏమని ?"

"ఈ స్నేహాలు అవీ మానుకొమ్మని"

"జయా, స్నేహం ఉంది కదా అని ఆమెని అవమానించలేను."

"నీ ఇంటి విషయమే అయితే ఇలానే చేస్తావా? నా పరువు పోతున్న సంగతి నీకక్కర్లేదు కదా."

పరువు!

పోతోంది!

గాలినైనా చూడగలం గానీ ఈ పరువేమిటో , అది ఎలా ఉంటుందో? అది ఎక్కడికిపోతుందో?

“జయా. ఈ వయసులో, ఇలాగే బతుకు అనడానికి మనమెవరం? ఆమె లైఫ్ ఆమెది.”

“నువ్వు చెప్పకపోతే మేమే చెప్పాలి ఇక”

“జయా, ఆమెను బాధ పెట్టకు. ప్లీజ్. సంతోషంగా ఉండనివ్వు.”

“నువ్వు సపోర్ట్ చేస్తున్నావా. విఠల్ కూడా అదే అన్నాడు.”

“ఏమని?"

“మేడం స్నేహం , సపోర్ట్ చూసుకునే, మీ అమ్మ ఇలా తయారవుతోందని.”

చెంప దెబ్బ తిన్నట్లైంది.

“జయా..ప్లీజ్!” నేను లేచి నిలబడ్డాను.

విసురుగా వెళ్ళిపోయింది. తలుపు కూడా జయనే సమర్థిస్తున్నట్టు విసురుగా మూసుకుపోయింది.

అపవాదు పడ్డపుడు మనంతట మనమే మాపుకోవాలని ప్రయత్నించ కూడదు. ఆ పనిని, కాలం అనే ఎక్స్పర్ట్ కు ఒప్పజెప్పాలి.

అప్పటినుండీ జయకు, నాకూ సంబంధాలు అంత బాగోలేవనే చెప్పాలి.

ఎదురుపడితే మొహమాటపు చిరునవ్వులతో పలకరించుకుంటున్నాం.

ఇదివరకులా, పనిలో నా సహాయం తీసుకోవడం మానేసింది. కష్టమో , నిష్టూరమో తన పని తనే చేసుకుంటోంది. కుదరనపుడు పని ఎగ్గొట్టి వెళ్ళడం, ఆ తప్పు ఎవరి మీదో నెట్టెయ్యడం మొదలెట్టింది.

మళ్ళీ డిపార్ట్ మెంట్ లో పోట్లాటలు , గొడవలు. అంతా చిరాకుగా తయారయింది. బాస్ గా, ఒక మెట్టు దిగడం ఎంతో తేలిక. తిరిగి అదే మెట్టు ఎక్కవలసి వస్తే , ఎవరెస్ట్ ఎక్కినంత! బ్లాక్ & వైట్ సినిమాల్లో , బాస్, కిందివాళ్ళతో కలివిడిగా ఉంటూ, వాళ్ళందర్నీ చక్కటి క్రమశిక్షణలో పెడుతూ, తీరిక సమయాల్లో దేవుడిలా పూజలందుకుంటూ ఉంటాడు. అదెలానో మరి. నాకెప్పటికీ అంతుబట్టని కిటుకు.

నేను సమయం కోసం ఎదురు చూస్తున్నాను. తప్పు చేసే వాళ్ళు ఎక్కడో ఒక చోట దొరక్కపోరు. జయ వాళ్ళాయన కూడా ఎదురుపడితే ముభావంగా ఉంటున్నాడు. రాళ్ళు గుచ్చుకుంటున్నాయని నడకమానలేము కదా. అలాగే నడవాలి.

జయను కంట్రోల్ చెయ్యకపోతే, యూనిట్ లో, ఇంకొంతమంది జయలు పుట్టే ప్రమాదం కనిపించింది. అప్పటినుండీ జయతో స్ట్రిక్ట్ గానే ఉంటున్నాను.

ఆ తర్వాత జరిగిన ఇంకొన్ని సంఘటనలు, నేను తనమీద కక్షగట్టి సాధిస్తున్నానని అనుకునేలా జరిగాయి. జయ వాళ్ళింటికి వెళ్ళడం తగ్గించాను.

నేను భయపడినట్టే, ఓ రోజు వల్లిగారు ఫోన్ చేసి “ఏమయ్యావే, రావడమే మానేశావు?"

“పని , బిజీగా ఉండీ ..”అంటూ నసిగాను.

“సరేలే, రేపు మాత్రం తప్పకుండా రావాలి. మా వాళ్ళందరినీ కార్తీకమాసపు వనభోజనాలు పిలిచాను. తోట లోనే.”

తోట.

తోట, మా స్నేహం గుర్తొచ్చాయి. స్నేహం అయిపోయిందనుకుంటే ఎంత దిగులొస్తుంది.

స్నేహం చేసే సమయం లో ‘వీళ్ళు లేకపోతే మన మనుగడ ఎలా’ అని అనుకుంటాము.

నిజానికి  ఎవరు లేకపోయినా జీవితం సాగుతుంది, ప్రాణం ఉన్నంత వరకూ.

"నువ్వూ రావాలి. నీ గురించి చెప్పడమే కానీ, నిన్నింత వరకూ చూపించలేదని మావాళ్ళు గొడవ చేస్తున్నారే. రేపు నిన్ను చూపిస్తానని వాళ్ళకు మాటిచ్చాను."

"నేనేమైనా సెలెబ్రిటీనా చెప్పండి. మీరు కానివ్వండీ."

"అదేంటే అలా అన్నావు. నా మీద కోపం వచ్చిందా చెప్పు. తెలియకుండా నిన్ను బాధపెట్టే మాట అన్నానేమో. అసలొక సారి ఇంటికి రా."

"ఛీ...ఛీ అదేం లేదండీ."

ఎప్పుడో కానీ రాని అతిథి కళ్ళ గుమ్మంలో నిల్చుంది.

"తప్పకుండా రావాలి మరి. రాకపోతే, నా మీద ఏదో కోపమున్నట్టే. రేపు వాసుదేవ్ పుట్టిన రోజు కూడా."

"ఓహో..అదా విశేషం."

"నోర్మూసుకో గాడిదా. అది ఊరికే కలిసి వచ్చింది. నువ్వు రాకపోతే మాత్రం మొత్తం కాన్సిల్ చేస్తాను. జయ ఉండడం లేదు. పాపకు క్విజ్ కోసం వెళ్తోంది. నువ్వూ లేకపోతే బాగోదు."

జయ ఇంట్లో ఉండదన్న మాట.

"హాస్పిటల్ బట్టలతో వచ్చేవు. చీర కట్టుకో."

"ఊ.."

"పసుపు పట్టు చీర కట్టుకో."

"ఊ.."

"ఏదైనా మంచి నగ పెట్టుకో."

ఊ కొడుతూ ఆలోచిస్తున్నాను. జయకు తెలిస్తే? ఏమనుకుంటుంది. అసలే ఇక్కడ పరిస్థితి  ఏమీ బాలేదు.

జయ సంగతి తలచుకోగానే, జయ వచ్చి నా ఎదురుగా నిలబడి ఉంది.

"కూర్చో జయా"

"రేపు పాప, నేను ముఖ్యమైన క్విజ్ కాంపిటీషన్ కి వెళ్తున్నాం. నాకు డ్యూటీ ఆఫ్  కావాలి."

"తీసుకో. నీ డ్యూటీ చెయ్యడానికి ఎవరున్నారు?"

"చాలా ట్రై చేశాను. ఎవరికీ కుదరదన్నారు."

"మరెలా? "

"ఎవరూ లేరు.  నువ్వు హెల్ప్ చేస్తావని.." వాక్యం పూర్తిచెయ్యకుండా నా వంక ఆశతో చూస్తోంది.

"రేపు నాకు పని ఉంది. కుదరదు."

"ప్లీజ్."

మొదటి సారి జయ నన్ను బతిమలాడుతోంది.

'పోనీ, వల్లిగారికి ఫోన్ చేసి రాలేనని చెప్తే?'

మొదట్లో అంత సహాయం చేసిన జయతో నేను స్ట్రిక్ట్ గా ఉండడానికి ముఖ్య కారణం , స్టాఫ్ కు నేనెలా ఉంటానో చెప్పడం కోసమే. యూనిట్ లో మిగిలిన వాళ్ళు ఇప్పుడిప్పుడే దారికి వస్తున్నారు.

జయ విషయం లో వెంటనే మెత్తబడితే, ఊహూ...ఇది సరైన టైం కాదు.

“సారీ జయా.  నువ్వు వేరే ఏర్పాటు చేసుకో.” స్థిరంగా ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాను.

దెబ్బతిన్నట్లు చూసింది.

“నువ్వెందుకిలా నిర్దయగా ప్రవర్తిస్తున్నావో అర్థం కావట్లా. ఎన్ని సార్లు హెల్ప్ చేశావు.”

“జయా. నువ్వు ఆఫ్ తీసుకో! బట్, నేను కవర్ చెయ్యలేను. రేపు నాకు ఒక ముఖ్యమైన పని ఉంది. వేరే ఎవరినైనా చూడు.”

“నీకు, ముఖ్యమైన పని? సెలవల్లో కూడా, డిపార్ట్ మెంట్ లో కూర్చునే నీకు, ముఖ్యమైన పని. నువ్వీ మధ్య మారిపోయావు. విఠల్ ఎంత కో ఆపరేటివో తెలిసి కూడా ఇలా రివెంజ్ తీసుకుంటున్నావా? పాపకోసమైనా హెల్ప్ చెయ్యకూడదా?”  జయ గొంతు దుఃఖంతో వణికింది.

మనం నమ్మిన మనుషులు, వాళ్ళ స్వభావం ఇదీ,  అని మనమొక అంచనా వచ్చిన తర్వాత, అంచనాలు మారితే వచ్చే దుఃఖం.

“నీ డ్యూటీ చేసే మనిషిని చూపించకుండా మాత్రం ఆఫ్ తీసుకోవద్దు. అది ఒప్పుకోను.” చెప్పాను.

వెళ్తూ వెళ్తూ జయ నా వంక చూసిన చూపులో భావానికి అసహ్యమనే పేరు పెట్టాలి. వేరే ఇంకే పేరు సరిపోదు.

రాత్రంతా నిద్రపట్టలేదు. బెడ్ సౌకర్యంగా లేదనుకున్నాను. త్వరగా తెల్లవారితే బాగుండనిపించే రాత్రి. ఉదయాన్నే వాకింగ్ కు వెళ్దామని లేచాను. ‘ఏం పోతాములే’ అని పేపర్ చూస్తున్నాను కానీ, మనసెక్కడో ఉంది.

ఫోన్ మోగింది.

చూస్తే జయ.

“ఇవాళ నాకు డ్యూటీకి రావడానికి వీలవదు"

చివరి నిముషంలో మానేస్తే, చచ్చినట్టు నేనే సర్దుకుంటానని  తన ధీమా!

నాకు కోపం కట్టలు తెంచుకుంది.

"జయా, ఇలాంటి బాధ్యత లేని పనులు చేస్తే, పరిణామాలేమిటో తెలుసా నీకు?" గట్టిగా అడిగాను.

"అదికాదు. నేను హాస్పిటల్ లోనే ఉన్నాను. నువ్వో సారి రా.”

జయ కార్డియాక్ ఐ సి యు ముందు నిల్చుని ఉంది.

“ఏమైంది?”

“రాత్రి విఠల్ అమ్మతో మాట్లాడాడు. చిన్న ఆర్గ్యుమెంట్. పెద్దదేం కాదు.”

“తర్వాత?”

“వన భోజనాలు కాన్సిల్ చేస్తున్నానని అందరికీ ఫోన్లు చేస్తూ చేస్తూ.. సిక్ అయింది. తీసుకుని వచ్చాం.”

“రాత్రే ఎందుకు ఫోన్ చెయ్యలేదు.”

“మెలకువ రాగానే, అమ్మ నీ గురించి అడిగింది.”

వల్లిగారు త్వరగానే కోలుకుని ఇంటికొచ్చారు. కొన్ని సర్దుబాట్లు చేసి, ఒక నెలపాటు జయకు డ్యూటీ తగ్గించాను. ప్రతి రోజూ హాస్పిటల్ పని అయ్యాక నన్ను రమ్మనే వారు. వీలైన రోజుల్లో సాయంత్రాలు, వల్లిగారి నచ్చేలా లేత రంగు కాటన్ చీరలు కట్టుకుని వెళ్ళేదాన్ని. కళ్ళలోనే ఉండేది మెచ్చుకోలు. నేను బాగుంటే ఆవిడ కేదో సంతోషం. ఆమె కోసం ప్రతి రోజూ చక్కగా తయారయి వెళ్ళడం అలవాటు చేసుకున్నాను. ఆవిడలా నాకు ఎన్నో విషయాలు తెలియదు. ఆ విజ్ఞానపు కబుర్లు చెప్పలేను. నాకు బాగా గుర్తున్నవి, నా చిన్నప్పటి విషయాలు చెప్పేదాన్ని. ఆ పిచ్చి కబుర్లను, ఆవిడ ఎంతో ఇష్టపడేవారు.

ఆ రోజు తోటలో కూర్చుందామన్నారు.

“బయట చల్లగా ఉంది.”

“పర్లేదులే. ఇంతలోనే మొక్క మొలుస్తానా?”

ఆమె ఎక్కువ మాట్లాడితే అలసిపోతారని నేనే మాట్లాడుతున్నా.

నా ఎలిమెంటరీ స్కూలు సంగతులు చెప్తూ, “స్కూలు కెళ్ళే దారిలో పాటలు పాడుకుంటూ వెళ్ళేదాన్ని.” అన్నాను.

“ఏంటీ, నువ్వు పాటలు పాడేదానివా? ఏదీ పాడు, వింటాను.”

శృతి జ్ఞానం లేనివాళ్ళకు పాడడం ఎంతో సులువు. తప్పులేమిటో తెలియవు గనక ! ఆమెతో బతిమాలించుకోకుండా పాడేశాను.

“ఆలయమేలా? అర్చనలేలా?

ఆరాధనలేలా?

పతిదేవుని పదసన్నిధి మించినది వేరే కలదా?

అదే సతి పెన్నిధికాదా? అదే పరమార్థము కాదా?”

“గాడిదా, పతికి పాద పూజచేసే మొహమేనా నీది?” నవ్వారు.

“చిన్నప్పుడు నాకేం తెలుసండీ. సుశీల గొంతు, ట్యూను నచ్చి పాడుకునేదాన్ని. మీరైతే చేస్తారా?”

“ప్రేమ అంటూ మొదలైతే, అది అనంతమే కావాలి.

ఆ ప్రేమలో భక్తి ఉంటుంది.

భక్తితో చూస్తే, అంతటా సౌందర్యమే!

పాదాలను కళ్ళకద్దుకోవాలనిపించేంత సౌందర్యం కనిపిస్తుంది.”

ప్రేమకు గుండెలో చోటుసరిపోక కళ్ళలోకి జారిందేమో, ఆమె కళ్ళు తళుక్కు మన్నాయి.

తోటలో లైట్లు వెలిగాయి. ఆమె గొంతులో వినిపించిన ప్రేమతత్వం, సముద్రపు ఒడ్డున చల్లగాలిలా, చుట్టుముట్టి, నన్ను వణికించింది.

“నాకూ కొన్ని విషయాలు ఈ మధ్యనే తెలిశాయి. అదేదో కొన్నేళ్ళ ముందు తెలిస్తే బాగుండేది."

"ఏమిటవి? '

"నేను ప్రిన్సిపాల్ గా ఉన్నపుడు, ఆడపిల్లల పట్ల నేను నిరంకుశంగా ప్రవర్తించాను. కెరియర్ పై దృష్టి లేకుండా ఏమిటీ ప్రేమలు అని విసుక్కునేదాన్ని."

"మీరన్నదాంట్లో తప్పేముంది. ఆ వయసులో చదువే కదా ముఖ్యం"

"ఇష్టపడిన వారితో మాట్లాడాలని, గడపాలని, అనుకోవడం ప్రకృతి సహజం. వాళ్ళ బాధని అర్థం చేసుకుని , వాళ్ళకో మార్గం చూపించాలికానీ, విసుక్కోవడం అన్యాయం కదా."

నిశ్శబ్దంగా ఆమె మాటల్ని వింటున్నాను.

“ఒకరిని ఇష్టపడితే బాగుంటుందని తెలిసింది.

ప్రేమించడంలో ఉన్న సంతోషం అర్థమైంది.

ఈ వయసులో ఎందుకనిపించింది? ఇలాంటి భావనలు ఏ వయసుకు ఆగిపోవాలి?

నాలోనూ ప్రేమ ఉంది. ఎవరినో అనంతంగా ప్రేమించి, ఆ భారం దించుకోవాలన్న స్వార్థం ఉంది."

ఒకరిని అభిమానించాక, వారి అభిప్రాయాలతో కూడా స్నేహమైపోతుంది. నా పరిస్థితి అలానే ఉంది.

“ఇష్టమనేది ఒకటి వచ్చేశాక ఏమీ చెయ్యలేము కదా. ఎవరికో నచ్చదని మొక్క ఎదగడం ఆపెయ్యలేదు కదా.”

“అన్యోన్యంగా ఉండే జంటలు ఒక వయసు దాటాక ఒకరినొకరు ఇష్టపడడం మానేస్తారా?”

"ప్రేమకు లక్ష్యం ఏమిటి? ప్రేమించిన వారినుండి తిరిగి అదే భావన ఆశించాలా?”

ఏం ప్రశ్నలు ఇవి? ఏం చెప్పాలి?

ఇవాళ ఆమె మాట్లాడుతున్న విషయాలు కొత్తగా ఉండి నన్ను కంగారు పెడుతున్నాయి.

నా గుండె చప్పుడు నాకే వినిపిస్తోంది.

ఆ రాత్రి ఇంటికొచ్చినా నిద్ర పట్టలేదు. కిటికీ నుండి కనిపిస్తున్న చీకటి వంక చూస్తున్నాను. ఎప్పుడో నాలుగవుతుండగా నిద్రపట్టింది.

తెల్లవారింది. కిటికీ నుండి ఎండపడుతుంటే, మెలకువ వచ్చింది. లేద్దామనుకుండగా ఫోన్ మోగింది.

మా ఇద్దరి స్నేహాన్ని జ్ఞాపకంగా మార్చేసిన ఫోన్ కాల్ అయిందది.

వల్లిగారింటికి వెళ్ళాను. ఎవరెవరో ఉన్నారు. ఒక్కరు కూడా తెలియదు. జయ పరుగున వచ్చింది.

“ఎలా జరిగింది?”

ఏమీ మాట్లాడకుండా నా భుజమ్మీద తలపెట్టుకుంది.

నా చేతుల మధ్య వల్లిగారి అమ్మాయి.

అన్నీ ముగిసే సరికి మధ్యాహ్నం అయింది. బయట ఎంతో మంది ఉన్నారు. నాకెంతో దగ్గరైన ఆ ఒక్కరు తప్ప. జయకు చెప్పేసి గేటు బయటకు వచ్చాను. ఏదో ముఖ్యమైనది పోయినట్లనిపించింది.

‘ఏమిటి , ఏమిటి’ అనుకుంటూ వెనక్కి వెళ్ళాను. ఆమె వయసు వారంతా ఒక చోట ఉన్నారు. బహుశా పార్క్ మిత్రులై ఉంటారు. దుఃఖమంతా, మనిషి రూపంలో నిలబడినట్టుగా అనిపించిన చోటు కెళ్ళి అడిగాను.

“మీరు ప్రొఫెసర్ వాసుదేవ్ కదా!”

ఆయన నావంక చూసి “అంటే మీరు...డాక్టర్"

అవునని తలూపాను. ఆయన పాదాల వంక చూశాను. వంగి కళ్ళకద్దుకున్నాను.

వల్లిగారి ప్రేమకు అర్థమైన పాదాలు!

COMMENTS